# ప్రజల మాట ప్రగతి బాట

# నకిరేకల్ నియోజకవర్గం

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

● తాసీల్దార్ పాల్‌సింగ్



శాలిగౌరారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తాసీల్దార్ పాల్‌సింగ్

శాలిగౌరారం, అక్టోబర్ 25 : ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తాసీల్దార్ పాల్‌సింగ్ అన్నారు. బుధవారం శాలిగౌరారం వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎంపీడీఓ రేఖల లక్ష్మయ్యతో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకుని కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చి ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధర రూ.2,203 పొందాలని సూచించారు. అనంతరం అడ్లూర్, తిరుమలరాయినిగూడెం, మాదారం కలాన్ గ్రామాల్లోనూ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈఓ నిమ్మల అంజనేయులుగౌడ్, మార్కెట్ కార్యదర్శి చీనా నాయక్, ఆర్ఐ నవీన్‌కుమార్, యారాల పద్మ, కర్నాటి శంకర్, చిలుకూరి సుమన్, నిమ్మల నరేశ్, రైతులు పాల్గొన్నారు.



రామన్నపేట : జనంపల్లి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పీఏసీఎస్ సీఈఓ జంగారెడ్డి

రామన్నపేట : మండలంలోని వివిధ గ్రామాల్లో పీఏసీఎస్ సీఈఓ జంగారెడ్డి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. రైతులు ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే అమ్మి మద్దతు ధర పొందాలన్నారు.

## ఎన్నికల సజావుకు ప్రజలు సహకరించాలి : సీఐ రాఘవరావు



శాలిగౌరారం : వంగమర్తి గ్రామంలో కేంద్ర బలగాలతో కలిసి ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న సీఐ రాఘవరావు

శాలిగౌరారం, అక్టోబర్ 25 : అసెంబ్లీ ఎన్నికలు సజావుగా జరిగేందుకు ప్రజలు సహకరించాలని సీఐ రాఘవరావు అన్నారు. బుధవారం మండలంలోని సమస్యాత్మక గ్రామాలైన వల్లాల, ఇటుకులపహాడ్, శాలిగౌరారం, వంగమర్తి తదితర గ్రామాల్లో కేంద్ర బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఎస్పీ ఆదేశాల మేరకు మండలంలోని పలు సమస్యాత్మక గ్రామాల్లో ముందస్తుగా పోలీస్ మార్చ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ సతీశ్ పాల్గొన్నారు.

## దుర్గాదేవి శోభాయాత్ర



శాలిగౌరారం : తిరుమలరాయిపిగూడెంలో దుర్గామాతను పురవీధుల్లో ఊరేగిస్తున్న భక్తులు

శాలిగౌరారం, అక్టోబర్ 25 : దేవీ శరన్నవరాత్రోత్సవాలు ముగియడంతో మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన కనకదుర్గాదేవి నిమజ్జనం వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. శాలిగౌరారం, తిరుమలరాయినిగూడెం తదితర గ్రామాల్లో దుర్గాదేవి శోభాయాత్రను డప్పు చప్పుళ్ల మధ్యన నిర్వహించారు. మహిళలు అమ్మవారికి నీళ్లు ఆరబోసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం నిమజ్జనం చేశారు.

## పోస్టల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి : సైదిరెడ్డి



కేతేపల్లిలో మాట్లాడుతున్న సైదిరెడ్డి

కేతేపల్లి, అక్టోబర్ 25 : పోస్టాఫీస్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూర్యాపేట పోస్టాఫీస్ వెస్ట్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ కె.సైదిరెడ్డి కోరారు. మండల కేంద్రంలో బుధవారం డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. రికరింగ్ డిపాజిట్, సేవింగ్స్ అ కౌంట్ సేవలను తపాలా అందజేయడం జరుగుతుందన్నారు. మహిళల కోసం ప్రత్యేకంగా మహిళా సమ్మాన్ సర్టిఫికెట్లతో పాటు తపాలా ఇన్స్‌రెన్స్ పథకాలైన పోస్టల్ లైఫ్ ఇన్స్‌రెన్స్, గ్రామీణ తపాలా జీవిత బీమా ఇన్స్‌రెన్స్‌ను అందజేయడం జరుగుతుందన్నారు. సమావేశంలో నకిరేకల్ సబ్ పోస్ట్‌మాస్టర్ ఎల్.రమేశ్, ఉద్యోగులు సుధీర్, ఆంజనేయులు, నాగమణి, అభిలాష, వెంకన్న, జానీపాషా పాల్గొన్నారు.

## కాంగ్రెస్ మొదటి లిస్ట్‌కే గాంధీ భవన్‌కు తాళాలు

- రెండో లిస్ట్ ప్రకటిస్తే జుట్లు పట్టుకుని అంగీలు చింపుకొంటరు
- నల్లగొండలో నలుగురు సీఎంలు తయారవుతున్నరు
- ఎక్కడికెళ్లినా ప్రజలు చిరుమర్తికి బ్రహ్మరథం పడుతున్నరు
- ఒక్కో ఇంటికి పది సంక్షేమ పథకాలు అందుతున్నాయి
- విలేకరుల సమావేశంలో ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్

నకిరేకల్, అక్టోబర్ 25 : కాంగ్రెస్ మొదటి లిస్ట్‌కే గాంధీభవన్‌కు తాళాలు వేసుకున్నారని.. రెండో లిస్ట్ ప్రకటిస్తే జుట్లు పట్టుకుని అంగీలు చింపుకునే పరిస్థితి వస్తుందని ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్ అన్నారు. నాలుగు పార్టీలు మారేటోళ్లు, పూటకో రంగు మార్చేటోళ్లు కాంగ్రెస్ నాయకులు అని, నల్లగొండలో నలుగురు ముఖ్యమంత్రులు తయారవుతున్నారని ఆయన ఎద్దేవ చేశారు. బుధవారం నకిరేకల్ పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చిరుమర్తి లింగయ్యతో కలిసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజక వర్గంలో ఎన్నికల ఇన్‌చార్జిగా చిరుమర్తి లింగయ్యతో కలిసి ప్రచారం చేస్తున్నప్పుడు ఎక్కడికి వెళ్లినా బీఆర్ఎస్ పార్టీనే గెలిపించుకుంటం.. కేసీఆర్ తిరిగి ముఖ్యమంత్రి కావాలి.. ఇక్కడ చిరుమర్తి లింగయ్యే మళ్లీ ఎమ్మెల్యేగా గెలువాలని చిరుమర్తికి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నట్లు తెలిపారు. బియ్యం, ఉచిత కరెంట్, రైతు బంధు, రుణ మాఫీ, రైతు బీమా, కల్యాణ లక్ష్మి, అమ్మ ఒడి, కేసీఆర్ కిట్, మిషన్ భగీరథ ద్వారా మంచినీళ్లు, మిషన్ కాకతీయ ద్వారా చెరువుల పూడికతీత, కాళేశ్వరం ప్రాజెక్ట్‌తో సాగునీరు. ఇన్ని కార్యక్రమాలు చేసిన ప్రభుత్వం మళ్లీ రావాలని చెప్పి ఎస్సీలు, ఎస్టీలు, బలహీన వర్గాలు సీఎం కేసీఆర్‌ను, ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యను గెలిపించుకోవాలని చూస్తున్నారన్నారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను రేపటి నుంచి ప్రజల్లోకి తీసుకెళ్లి, ఇంటింటికీ తిరిగి అవగాహన కల్పించనున్నట్లు వివరించారు. కాంగ్రెస్ ఆరు డిక్లరేషన్లను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు కర్ణాటకలో రెండు, మూడు గంటలు కరెంట్ ఇచ్చే పరిస్థితి ఆ పార్టీకి లేదని విమర్శించారు. ఛత్తీస్‌గఢ్‌లో పండిన పంటను కొనే నాథుడే లేదన్నారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు చెప్పే మాయ మాటలను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. మన జిల్లాలో నలుగురు ముఖ్యమంత్రులు తయారయ్యారని, జానారెడ్డి, వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సీఎం పదవి కోసం కొట్లాడుతున్నారే తప్పా, ప్రజలకు సేవ చేద్దామనే ఆలోచన లేని నాయకులకు ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. కాంగ్రెస్‌లోకి ఇంకో ఆయన వస్తున్నారంటున్నారు. నాలుగు పార్టీలు మారేటాయన, పూటకో రంగు మార్చేటాయన వస్తున్నడంటున్నరు. ఆయన కూడా ముఖ్యమంత్రి అంటాడేమో అన్నారు. మన నియోజక వర్గం ప్రశాంతంగా ఉండాలన్నా, అరాచకాలు, రౌడీయిజం లేకుండా ప్రజలు ఎవరి పని వారు చేసుకుని జీవించాలంటే సౌమ్యుడు, అభివృద్ధి కోసం పనిచేసే వాడు, చెడును ప్రోత్సహించని వ్యక్తి చిరుమర్తి లింగయ్యను గెలిపించుకోవాలని కోరారు. రూ.200 కోట్లతో బ్రాహ్మణవెల్లెంల ప్రాజెక్ట్, రూ.100 కోట్లతో అయిటిపాముల లిఫ్ట్, రూ.75 కోట్లతో కేతెపల్లి మూసీ రైట్ కెనాల్ పనులు, నకిరేకల్‌లో రూ.135 కోట్లతో వంద పడకల ఆస్పత్రి, రోడ్డు విస్తరణ, సెంట్రల్ లైటింగ్, తిప్పర్తి రోడ్డు, కడపర్తి రోడ్డు అభివృద్ధి పనులు చేస్తున్నారని, అటువంటి వ్యక్తిని తిరిగి మూడోసారి ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలని పేర్కొన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల ప్రదీప్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షులు ప్రగడపు నవీన్‌రావు, మారం వెంకట్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు యల్లపురెడ్డి సైదిరెడ్డి పాల్గొన్నారు.

## అభివృద్ధికే మళ్లీ పట్టం కట్టాలి

జడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి, ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



ఇంద్రపాలనగరం గ్రామంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

రామన్నపేట, అక్టోబర్70 : అభివృద్ధి, సంక్షేమాన్ని సుస్థిరంగా అందజేస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికే మళ్లీ పట్టం కట్టాలని జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, నకిరేకల్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. బుధవారం మండలంలోని నిధానపల్లి గ్రామంలో మల్లన్న గుట్టపై పూజలు నిర్వహించి నిధానపల్లి, ఇంద్రపాలనగరం గ్రామాల్లో గడపగడపకూ వెళ్లి కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థిస్తూ ఎన్నికల ప్రచార నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్‌కు ఓటేస్తే 3 గంటల కరెంట్, బీజేపీకి ఓటేస్తే మోటర్లకు మీటర్లు పెడుతారన్నారు. సంక్షేమం, అభివృద్ధిని గాలికి వదిలి కుర్చీల కోసం కొట్లాడుకుంటారన్నారు. ఇప్పటికే జిల్లాకు ముగ్గురు ముఖ్యమంత్రులం మేమే అంటూ ప్రచారం చేసుకుంటున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ పాలనలో ప్రతి గ్రామంలో కోటి రూపాయలకు పైగా అభివృద్ధి చేశామన్నారు. ఇచ్చిన ప్రతి హామిని నెరవేర్చినట్లు, మరోసారి కారు గుర్తుపై ఓటు వేసి ఆశీర్వదించాలని కోరారు. అరాచాకాలు కాకుండా ప్రశాంతంగా సాగుతున్న పాలనకే తిరిగి పట్టం కట్టాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ నంద్యాల భిక్షంరెడ్డి, సర్పంచులు గుత్తా నర్సింహారెడ్డి, కాటేపల్లి యాదయ్య, ఎడ్ల మహేందర్‌రెడ్డి, మదర్ డెయిరీ డైరక్టర్ మందడి ప్రభాకర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కంభంపాటి శ్రీనివాస్, రైతు బంధు సమితి మండలాధ్యక్షుడు బొక్క మాధవరెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మందడి ఉదయ్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి పోశబోయిన మల్లేశం, గ్రామ శాఖ అధ్యక్షులు గర్దాసు విక్రమ్, వర్కాల మొగులయ్య, నాయకులు పున్న జగన్‌మోహన్, కన్నెబోయిన బలరామ్, అంతటి రమేశ్, మందడి సాగర్‌రెడ్డి, బందెల రాములు, బొక్క పురుషోత్తమ్‌రెడ్డి, మందడి శ్రీధర్‌రెడ్డి, సాల్వేరు అశోక్, మంటి లింగస్వామి, నిమ్మగడ్డ పద్మారావు పాల్గొన్నారు.



పిల్లాయిపల్లి కాల్వ నీటితో నిండిన శంభోని చెరువు

## వెల్లంకి చెరువులకు జలకళ



పిల్లాయిపల్లి కాల్వ నీటితో నిండిన ఈదుల చెరువు

రామన్నపేట, అక్టోబర్ 25 : మండలంలోని వెల్లంకి గ్రామంలోని చెరువులు జలకళను సంతరించుకున్నాయి. పిల్లాయిపల్లి కాల్వ ద్వారా నీరు రావడంతో గ్రామంలోని శంభోని చెరువు, ఈదుల చెరువు నిండి అలుగు పోసే స్థితికి చేరుకొనడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సర్పంచ్ ఎడ్ల మహేందర్‌రెడ్డి, రైతుల సహకారంతో చెరువులను నింపడానికి చేసిన ప్రయత్నం ఫలించింది. రైతులు రబీలో వరి సాగు చేసేందుకు సన్నద్ధం అవుతున్నారు. వర్షాలు లేక భూగర్భ జలాలు అడుగంటి పోతున్న తరుణంలో చెరువులు నిండు కుండలా దర్శనం ఇస్తుండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## నేడు పలు గ్రామాల్లో ఎమ్మెల్యే చిరుమర్తి ఎన్నికల ప్రచారం

కట్టంగూర్, అక్టోబర్ 25 : ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య గురువారం మండలంలోని పలు గ్రామాల్లో ప్రచారం నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఊట్కూరి ఏడుకొండలు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కల్మెర, పరడ, నారెగూడెం, నల్లకుంటబోలు, ఈదులూరు, పందనపల్లి గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించి ప్రధాన కూడళ్లలో ప్రసంగించనున్నట్లు వెల్లడించారు. ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.